క్లుప్తంగా

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

• డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



సూచనలు ఇస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్ ప్రాంతంలో పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై స్థానికుల నుంచి వచ్చిన వినతుల మేరకు సోమవారం ఆయా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య అధికారులతో కలసి పర్యటించారు.పలు సూచనలు చేశారు. అనంతరం ఓల్డ్ కరాస , న్యూ కరాస ప్రాంతాల్లో సి.సి రోడ్ల నిర్మాణ పనులను అధికారులతో కలసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఏఈ ఉషా, సెక్రటరీ అనూప్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణ పనుల పరిశీలన

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా సోమవారం పర్యటించారు. సుమారు రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మిస్తున్న రక్షణ గోడ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు బోండా కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

రథయాత్రకు ఆహ్వానం

మల్కాపురం: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో 2018లో గుజరాత్‌లో ప్రారంభమైన సోమనాథేశ్వర వజ్ర లింగం రథయాత్ర ఈ నెల 30న మల్కాపురం ప్రాంతంలో ప్రవేశించనుందని బ్రహ్మకుమారీస్ సంస్థ శ్రీహరిపురం బ్రాంచి నిర్వాహకురాలు సింధూ తెలిపారు. ఈ యాత్రలో పాల్గొనాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే గణబాబును ఆహ్వానించారు. భక్తులంతా రథయాత్ర కార్యక్రమంలో పాల్గొని సోమనాథేశ్వరుడిని దర్శించుకుని తరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం త్యాగాలకు సిద్ధం



దీక్షలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, తదితరులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఎన్ని రోజులైనా పోరాడేందుకు, ఎలాంటి త్యాగాలకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్ వి.కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. జీవీఎంసీ పార్కులో స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇదే రోజున ప్రధాని మోడీ స్ట్రాటజిక్ సెల్ పేరుతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్నట్లు ప్రకటించారన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ని అవాంతరాలు వచ్చినా, కోవిడ్ సమయంలో కూడా దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తూ కార్మికులు పోరాడుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం కార్మిక వర్గ పోరాట ఫలితమేనన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ పరిష్కారం కాదని... తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, సొంత గనులు కేటాయించడమే శాశ్వత పరిష్కారమన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ కోసం సొంత గనులు కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, బి.భారతి, కె.మణి, బి.సత్యవతి, సుజాత, వి.కృష్ణారావు, ప్రొఫెసర్ సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఆ బజారు నిత్యం రద్దీగా ఉంటుంది. పదుల సంఖ్యలో కాలనీ వాసులకు అదే పెద్ద దిక్కు. అలాంటి బజారులో కనీస వసతులు లేక అటు రైతులు..ఇటు వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. అదీ కూడా పర్యవేక్షణాధికారులు ఉండే కూతవేటు దూరంలోని **గోపాలపట్నం** రైతు బజారులో **ఈ పరిస్థితి** ఉండడం గమనార్హం.

పార్కింగ్ సమస్య

గోపాలపట్నం రైతు బజారు విశాలంగా ఉంటుంది. దీన్ని సరైన విధంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. రైతు బజారుకు వచ్చేవారు వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు తగిన విధంగా స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. చాలా మంది వినియోగదారులు రైతు బజారులో పార్కింగ్ చేయకుండా బయట అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వాపోతున్నారు. ప్రధాన రహదారి నుంచి రైతు బజారులోకి వచ్చే రహదారిలో **ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**



రైతు బజారు ఎదుట అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

రైతు బేజారు!

- నేలపైనే **విక్రయాలు**
- అధ్వానంగా **డ్రైనేజీ**
- నిరుపయోగంగా **కంపోస్టు యూనిట్**
- అలంకార ప్రాయంగా **కోల్డ్‌స్టోరేజీ**
- ఇదీ గోపాలపట్నం **రైతుబజారులో** దుస్థితి

గోపాలపట్నం: గోపాలపట్నం **పరిసర ప్రాంతాల్లో** ఉన్న వారికి రైతు బజారే **ఆధారం. ఉదయం,** సాయంత్రం సమయాల్లో **అధిక సంఖ్యలో వినియో**గారులు వస్తుంటారు. **అందుకు తగ్గట్టు వసతులు** కానరావడం లేదు. నిర్వహణ లేక ఉన్నవి కూడా మూలకు చేరాయి.

ఇదీ పరిస్థితి

ఈ బజారుకు 262 మంది రైతులు కాయగూరలు తీసుకు వస్తుంటారు. వీరిలో రోజుకు సుమారు 160మంది వస్తుంటారు. ఆదివారం, బుధవారం పండగల సమయాల్లో ఎక్కువ మంది రైతులు వస్తుంటారు. రోజుకు ఈ బజారులో సుమారు రూ.15 నుంచి రూ. 18 లక్షల వ్యాపారం జరుగుతుంది. రైతు బజారులో 191 స్టాళ్లు ఉండగా అందులో డ్వాక్రా మహిళలకు 26, సూపర్ బజారు, కోడి గుడ్ల దుకాణాలు, ఇతర వ్యాపారాలకు 14 స్టాళ్లు కేటాయించారు.

రైతులకు అవస్థలు

బజారు రైతులకు సరిపడా ఫ్లాట్‌ఫారాలు లేకపోవడంతో చాలా నేలపైనే కాయగూరలు వేసి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఎండ.. వర్షాల సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.



రైతు బజారులో కింద కూర్చొని వ్యాపారాలు చేస్తున్న రైతులు

నిరుపయోగంగా కోల్డు స్టోరేజీ

గోపాలపట్నం రైతు బజారుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు తమ సరుకులను ఇక్కడి కోల్డు స్టోరేజీలో పెట్టేవారు. అరకు వంటి గిరిజన ప్రాంతాల నుంచి వచ్చువారికి ఇది ఎంతగానో ఉపయోగడేది. అయితే ఇపుడు ఇది నిరుపయోగంగా పడి ఉంది.

ఆహ్లాదం కరువు

పిల్లలు కాసేపు సేద తీరేవిధంగా బజారు వెనుక ప్రాంతంలో పార్కు అభివృద్ధి చేశారు. అయితే నిర్వహణ లేక బెంచీలు విరిగిపోయాయి. చెత్తా చెదారంతో నిండి**పో**యింది.దీంతో ఆహ్లాదం కరువైంది.

మురుగు కంపు

రైతు బజారులో **దీర్ఘకాలిక సమస్యగా** డ్రైనేజీ వ్యవస్థ ఉంది. మురుగు వెళ్లే కాల్వలపై వేసిన పలకలు పాడయ్యాయి. దీంతో **వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల గోతులు ప్రమాదకరంగా ఉన్నాయని వాపోతున్నారు. అన్నా క్యాంటీన్ నుంచి మురుగు నీరు రైతు బజారులో నుంచే వెళ్తుంది. మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు.**



రైతు బజారులో పాడైన పలకలు

నిరుపయోగంగా వర్మీ కంపోస్టు పిట్‌లు

రైతు బజారులో వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు.. వర్మీ కంపోస్టు పిట్లు ఏర్పాటు చేశారు. అయితే దీనిపై అధికారుల్లో చిత్త శుద్ధి కరువై గాలికొదిలేశారు. పైన షెడ్లు వేయలేదు. గతంలో ఆర్గానిక్ వ్యవసాయం చేసే రైతు వీటిని నిర్వహించేందుకు ముందుకు వచ్చాడు. కొన్నేళ్లు చేసి వదిలేశాడు. అప్పటి నుంచి ఇది మూలకు వెళ్లిపోయింది.



నిరుపయోగంగా కోల్డు స్టోరేజీ



నిర్లక్ష్యంగా వదిలేసిన పార్కు



అధ్వానంగా వర్మీ కంపోస్ట్ పిట్లు

యాత్రికుల వసతి గృహాల సందర్శన



యాత్రికుల వసతి గృహ సముదాయాలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్ సమీపంలోని జిల్లా పరిషత్‌కు చెందిన యాత్రికుల వసతి గృహాల సముదాయాన్ని సోమవారం జెడ్పీ చైర్ పర్సన్ జె. సుభద్ర, సీఈవో నారాయణ మూర్తి సందర్శించారు. ఈ వసతి గృహాల సముదాయం సుమారు 1.09 ఎకరాల విస్తీర్ణంలో ఉందని గుర్తించారు. జిల్లా పరిషత్ స్థలంలో ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులతోమాట్లాడారు. ఇక్కడి సదుపాయాలు, బోధన వంటి పలు అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అనంతరం పురుషోత్తపురంలో ఉన్న జిల్లా పరిషత్ ఆస్తులను పరిశీలించారు. అడవివరంలో జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ స్థలం రోడ్డు విస్తరణలో ఎంత పోయిందో అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఉన్నారు.

అప్పులు చేసి పరారీ!

- రూ.30 లక్షలకు టోకరా పెట్టిన దంపతులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

మల్కాపురం: తెలిసిన వారి నుంచి అప్పులు చేసి.. తీర్చలేక భార్యా భర్తలు పరారీ అయ్యారు. తమకు న్యాయం చేయాలని బాధితులు మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు. సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి భార్య వాణి,కుమారుడు భార్గవ్ ఉన్నారు. అయితే కృష్ణ అతని భార్య వాణి ఇంటి యజమాని వద్ద సుమారు రూ.16 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అలాగే మామ వద్ద రూ. 12 లక్షలు, ఇతరుల వద్ద రూ. 2 లక్షలు అప్పు తీసుకున్నారు. తీసుకున్న రుణానికి వడ్డీ కట్టకుండా, అసలు కూడా ఇవ్వకుండా డబ్బులు ఇచ్చిన వారిని తిప్పుతున్నారు. ఈ క్రమంలో కృష్ణ అతని భార్య వాణి,కుమారుడు భార్గవ్‌లు అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి అదృశ్యం అయ్యారు.సాయంత్రమైనా వారు రాకపోకపోవడంతో అను మానం వచ్చి ఇంటి యజమాని సోమవారం పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కృష్ణ, వాణిలకు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో వారి ఆచూకీ కోసం పోలీసులు విచారిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే ప్రమాదాలు



మృతులకు నివాళులర్పిస్తున్న సీఈ యూనియన్ నాయకులు కార్మికులు



ఎన్ఏడీ గేటు వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎన్ఏసీఎస్ అండ్ డబ్ల్యూ యూనియన్ సభ్యులు

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మృతులకు ఘన నివాళి

గోపాలపట్నం: రక్షణ రంగం, రైల్వేలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీ కరణ విధానాల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు విమర్శించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం నేవల్ ఆర్మమెంట్ డిపో (ఎన్ఏడీ) మెయిన్ గేటు సమీపంలో మహారాష్ట్ర బండారా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జరిగిన బ్లాస్టింగ్‌లో మృతి చెందిన 8 మంది కార్మికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులు అనుమతించడంతో పాటు బ్రిటిష్ కాలం నాటి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేట్ సంస్థలు, ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారని వాపోయారు. అప్‌లోడింగ్ విపరీతంగా జరుగుతోందని దీని వల్లే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ రంగంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీ అయ్యాయని వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రక్షణ రంగంలో సమ్మెలను నిషేధించి సమస్యలపై నిలదీస్తున్న నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఇటీవల 36 మంది కార్మికులను సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. డాక్ యార్డులో 46 మంది కార్మికులకు వార్నింగ్ లెటర్లు ఇచ్చారన్నారు. ఇలాంటి చర్యల ద్వారా కార్మికులను బయపెట్టాలని చూస్తోందని అన్నారు. కార్యక్రమలలో ఎన్ఏడీ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాస్, నూకరాజు, డీవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

ఇటీవల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో చోటు చేసుకున్న ప్రమాదంతో మృతి చెందిన కార్మికులకు ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద నేవల్ ఆర్మెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ప్రమాదంలో 8 మంది కార్మికులు మృతిచెందడం బాధాకరమన్నారు.

ఉమామహేశ్వరరావుకు 'మళ్ల' పరామర్శ



ఉమామహేశ్వరరావుతో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు సర్వసిద్ధి సాయిలత భర్త, ఆ పార్టీ సీనియర్ నాయకుడు సర్వసిద్ధి ఉమామహేశ్వరరావు అనారోగ్యం బారిన పడ్డారు. ఈ విషయం తెలసుకున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సోమవారం గొల్లకంచరపాలెంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని మళ్ల విజయప్రసాద్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి కిరణ్, వార్డు అధ్యక్షులు ఆడారి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్‌యాదవ్, బాకీ శ్యామ్‌కుమార్, సతీష్, నమ్మి శ్రీను, నమ్మి శశికుమార్, మహిళా నాయకులు రాజ్యం,గోవిందమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీవోఏల దీక్షలు



జీవీఎంసీపార్కులో రిలే దీక్ష చేస్తున్న ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం

సీతమ్మధార : కూటమి అధికారంలోకి వచ్చాక వీవోఏల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం వహిస్తోందని ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజులు రిలే దీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వీవోఏలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. అక్రమంగా తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనని పేర్కొన్నారు. కోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని.. జీతాలు వేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రతి మండలం నుంచి ఐదుగురు ముఖ్యమైన నాయకులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అపర్ణ, కుంచమ్మ , కోశాధికారి శ్రీలక్ష్మి, యూనియన్ ముఖ్య నాయకులు వెంకటలక్ష్మి, పార్వతి, శారద తదితరులు దీక్షలకు నాయకత్వం వహించారు.

11న పైడిమాంబ అమ్మవారి పండగ

18న మారువారం



మాట్లాడుతున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ప్రజల ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి పండగను ఫిబ్రవరి 11న అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆలయ ప్రాంగణం వద్ద గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ హాజరై ఆలయ ఈవోతో కలిసి పండగ ఏర్పాట్లపై గ్రామ పెద్దలతో చర్చించారు. పలు సూచన సలహాలు చేశారు. 11న ప్రధాన పండగ, 18న మారువారం పండగకు చుట్టుపక్కల కాలనీలతో పాటు పరిసర గ్రామాల ప్రజానీకం కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందన్నారు. దేవస్థానం తరఫున విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు, ప్రసాద వితరణ, బారికేడ్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం స్టేజ్ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గ్రామ పెద్దలు, దాతలు సహకరించి అమ్మవారి పండగను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పురెడ్డి ప్రకాష్‌రెడ్డి, చుక్క పైడిరాజు రెడ్డి, త్రివేణి గ్రామ అభ్యుదయం సేవా సంఘం అధ్యక్షుడు ఎలమంచిలి చంద్రరావు, పురెడ్డి పైడిరెడ్డి, నూక రెడ్డి, గురురామరెడ్డి, చక్రవర్తి రెడ్డి, కిషోర్ రెడ్డి, రవీంద్రరెడ్డి, శరగడం అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో వైద్య శిబిరం



నేత్ర వైద్య పరీక్షలు ప్రారంభిస్తున్న ఐటీఐ ప్రిన్సిపాల్ రమణ, వైద్య సిబ్బంది

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లో గల కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక బాలికల శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో సోమవారం శంకర్ ఫౌండేషన్, బీఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ జి.రమణ నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ డి.దత్తు, ఎం.చంద్రశేఖర్ పర్యవేక్షణలో 256 మందికి నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు బుజ్జి, ఎం.సుజాత, తులసి, పిల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి

మల్కాపురం: ఐక్యత, సమగ్రత వంటి రాజ్యాంగ లక్ష్యాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి కోరారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో సోమవారం రాజ్యాంగ పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎవరు ఏ వృత్తిలో ఉన్నప్పటికీ అంతా రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కోరారు. 75 ఏళ్లలో మహిళల జీవితంలో,అట్టడుగు వర్గాల్లో ఎంతో మార్పు కనిపిస్తుందన్నారు. అతి సామాన్యుల కూడా అత్యున్నత పదవులు పొందే అవకాశం రాజ్యాంగం ద్వారా ఏర్పడిందని చెప్పారు.సేవ, త్యాగం,నిజాయతీ, పట్టుదల,క్రమశిక్షణ అలవర్చుకున్నప్పుడే భారతదేశం గొప్ప దేశం కాగలదని ఆమె అన్నారు.

పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్సూరెన్స్ కొనసాగించాలి

అగనంపూడి: ఉక్కు విశ్రాంత ఉద్యోగులకు పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్సూరెన్స్ కొనసాగించాలని అగనంపూడి ప్రాంత ఉక్కు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి గుదే సుశీలా గజేంద్రరావు కోరారు. సీడబ్ల్యూసీలో అగనంపూడి ప్రాంత విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వైద్య, ఆరోగ్య సౌకర్యాలు కల్పించే పథకంలో ఉక్కు యాజమాన్యం మార్పులు తీసుకువచ్చి, ఆర్థిక భారం మోపడం దారుణమన్నారు. కొత్త మెడికల్ ఇన్సూరెన్స్ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయిన సన్యాసిరావు, బలిరెడ్డి సత్యనారాయణ, బొండా ఈశ్వరరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలు అడ్డుకోవాలి



ఐటీఐ గేటు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

కంచరపాలెం : ఫీజుల పేరుతో ఇబ్బంది పెడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆత్మహత్యలను అడ్డుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కంచరపాలెం ఐటీఐ కూడలిలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం వద్ద ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు పీడీఎస్‌వో ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల ఆత్మహత్యలపై ఎంక్వైరీ కమిటీ వేసి ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా ఐటీఐ ప్రధాన గేటు వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మి, సభ్యులు చందు, ప్రేమ్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.